# ఓవర్ యాక్షన్

వేటూరు మనుస్వామి

“ఎంత బావుందీ దృశ్యం !” అనుకుంటూ రెయిలింగ్ మీదికి ఒంగి గలగలపారుతున్న పెన్నానదిని చూస్తున్నాడు అనంత్. ‘నా ఆనందం అనంతం !’ స్వగతం, ప్రకాశం కలగల్పిన అతని వాలకం ఆత్మహత్యకు పూనుకుంటున్న వాడిలా అపోహపడ్డాడు ఆ దారిన పోయే దానయ్య.



‘ఏం పనయ్యా నువ్వు చేస్తున్నది ? చచ్చి ఏం సాధించాలనీ ? ఈ రోజుల్లో కుర్రకారుకు మనోస్థైర్యం అబ్బే...’ అంటూ అతగాడు తన చెయ్యి పట్టుకుని వెనక్కు లాగుతుంటే విదిలించుకున్నాడు అనంత్.

‘నీ కెవరు చెప్పారయ్యా నేను నీళ్ళల్లోకి దూకుతున్నాననీ, ఏమిటీ గుంజడం, మర్యాద లేకుండా ... ఆఁ!’ తను కన్నెర్ర చేస్తుంటే దానయ్య నింపాదిగా అన్నాడు.

‘ఇక నువ్వు చెప్పాల్సిన అవసరమేముంది ? నీ వాలకమే చెప్పక చెబుతుంటే ఆత్మహత్యకు దిగుతున్నావని. సమయానికి నేను చూశాను కాబట్టి సరిపోయింది. లేకుంటే ఒక నిండు ప్రాణం నీళ్ళపాలు... ఇది పెద్ద హెడ్డింగ్‌తో రేపటి లోకల్ న్యూస్. ఓ ప్రాణాన్ని కాపాడిన పుణ్యం నాకు దక్కించావు. థాంక్స్ ! పద మీ ఇంటి దగ్గర దిగవిడిచి నా దారిన నేను పోతాను...’

‘మహాప్రభో ! నాకు కావాల్సినంత ఆస్తి ఉంది. అమ్మా నాన్న ఉన్నారు. ఏ చీకూ చింతా లేదు... పై నెలలోనే నాకు పెళ్ళి. ప్రకృతి ఆరాధనలో ఇలా నిలుచున్నాను. అంతే. కానీ ఆత్మహత్య చేసుకోవాలని కాదు. నా మాట నమ్ము. నా దారిన నన్నొదిలి...’ ఇంకా అతను చేయి వీడని దానయ్యతో చెప్పాడు అనంత్...

“నా ఖర్మ కాలి ఈ మూర్ఖుడి కంట పడ్డాను ! ఇక్కడ్నుంచి పరుగు తీస్తే కానీ నా మనసు శాంతించేట్లు లేదు...’ స్వగతంతో.

తనకున్న చిత్రమైన బలహీనతని, స్వగతాన్ని సైతం పైకే సణగడం. ‘అదిగో... నీ మనస్సు శాంతిగా లేదని నువ్వే ఒప్పేసుకుంటున్నావు. కాబట్టే ఈ ఆత్మహత్యా ప్రయత్నం చేస్తున్నావు. నే నాట్టే మంచివాడిని కాను. చెంపలు వాయగొట్టిమరీ నా దారికి తెచ్చుకోగలను. అంతదాకా నన్ను రానీకు. మీ ఇంటి అడ్రెస్ చెప్పు. ఆటోలో తీసుకెళ్ళి దిగవిడవందే నిన్ను విడిచి పెట్టేది లేదు !’ దానయ్య కరుగ్గా అంటూంటే

‘ఇదెక్కడి మంచితనమండీ బాబూ ! నేను నిజమే చెపుతున్నాను. ఆత్మహత్య చేసుకోవాల్సిన ఖర్మ నాకేం పట్టలేదు. నన్నొదులు. నీ ఎదుటే ఇక్కడ్నుంచి వెళ్తాను... తన పట్టు నుంచి అనంత్ విడిపించుకోవాలని గుంజుకుంటూ...

‘పొద్దున్నే ఎవరి ముఖం చూశానో ఈ త్రాష్టుడిపాలపడ్డాను. కొంచెం పట్టు సడలించినా ఇక చూస్కో...’ అని స్వగతమనే ప్రకాశాన్ని శుభ్రంగా వినడం జరిగింది.

‘అదిగో నేను పట్టు సడలిస్తే ఇక చూస్కో... అంటే అర్థమేమిటి ? కళ్ళ ముందే నీళ్ళలోకి దూకేయాలనేగా నీ పంతం ! ఇలా కాదు కానీ పోలీస్ స్టేషన్‌కి పద. వాళ్ళకు అప్ప చెప్పేస్తే నా బాధ్యత తీరినట్లు !’

అనంత్ ఇంకేం మాట్లాడేందుకు స్కోప్ ఇవ్వకుండా అతన్ని చరచరలాక్కుపోసాగాడు దానయ్య.

‘ఇంతదాకా సహనం వహించాను. నువ్వు వినలేదు. ‘అయిపోయావురా నా చేతిలో...’ అనుకుంటూ ఉగ్రంగా చేతులు, కాళ్ళు బిగించాడు అనంత్.

కళ్ళు మూసి తెరిచే లోపలే దానయ్య అల్లంత దూరానపడ్డాడు. తన ‘హ౹! హా౹! కరాటే విద్య విజృంభణతో. ‘ఇప్పటికైనా నీ దారిన పోయావా సరి ! నా జోలికి రావాలని చూశావా ! ఈసారికి నీ చెయ్యో కాలో విరిచేస్తాను’ అంటూ మళ్ళీ తన కరాటే హాహాకారాలతో గాల్లోకి లేవగానే ‘చచ్చాన్రోయ్ ! గావుకేకతో తనెటుపరిగెట్టున్నాడో తెలియనంత అయోమయావస్థలో రెయిలింగ్ మీది నుంచి పెన్నానదిలోకి దూకేశాడు దానయ్య.

‘ఇంతసేపూ నన్ను కాపాడాలని చూసిన వెర్రి సన్యాసి ! నిన్నే నేను కాపాడాల్సొచ్చింది కదరా... ’ మామూలు స్టేజ్ కొచ్చేసిన అనంత్ మానవత్వంతో ముందు వెనుకలు చూసుకోకుండా నీళ్ళల్లోకి దూకేసి...

“కాపాడండీ... ! కాపాడండీ ! మునిగిపోతున్నాను...” అంటూ నీళ్ళ ప్రవాహంలో కొట్టుకుపోతూ ప్రాణభయంతో గావుకేకలు పెడుతున్న దానయ్యను కష్టపడి ఒడ్డుకు చేర్చేసరికి తన తల ప్రాణం తోకకొచ్చింది.

“నువ్వెక్కడరా ఓవర్ యాక్షన్ లేకుండా మసలేది ? ఏదోనాడు ఖంగు తింటావు అని మా నాన్న అంటూనే ఉంటాడు -ఇప్పుడది అక్షరాలా నిజమైంది. నన్ను క్షమించు బాబూ ! నిన్ను విసిగించినా మంచి మనసుతో నా ప్రాణాలు కాపాడావు. నీ మేలు ఈ జన్మలో మరిచిపోలేను. నీ కన్నా పెద్ద వాడిని. నీ కాళ్ళు పట్టుకో కూడదు...“ తన చేతులు పట్టుకుని కృతజ్ఞతగా వాపోతున్న దానయ్యను చూస్తూ ఏడవలేని నవ్వుతో...

‘నువ్వు నడిచి వెళ్ళలేని స్థితిలో ఉన్నావు. మీ ఇంటి అడ్రస్ చెప్పు ఇంకాట్టే సుత్తికొట్టకుండా. ఆటోలో దిగవిడిచినా దొరికిపోతాను...’ అన్నాడు అనంత్.

‘నీ కంత శ్రమ అక్కర్లేదు బాబూ ! నేనే వెళ్ళగలను.

థ్యాంక్స్ ! అని చెపుతూ తన కళ్ళెదుటే నడిచి వెళ్తున్నతన్ని విడ్డూరంగా చూశాడు.

‘ఓరీ ! మీ అమ్మా నాన్నల కెలా పుట్టావో కానీ ఈ కొద్ది సేపటికే నా తల వాచిపోయిందే. పాపం ! వాళ్ళెలా వేగుతున్నారో నీ ఓవర్ యాక్షన్‌తో...’ అనుకుంటూ షరా మామూలుగా తన ఈ స్వగతమూ పైకే ధ్వనొచ్చి అప్పుడే అటెళ్తున్న ఒకతను ‘పీడెవడ్రా ! నాతో ఏం పరిచయముండి, ఏం చూశాడని ఓవర్ యాక్షన్ అంటున్నాడు’ అనుకుంటూనే ముందుకు సాగిపోయాడు. కానీ అనంత్‌తో వాదులాటకు మాత్రం దిగలేదు.

ఒకర్ని పోలి ఇంకొకరుండనరేందుకు ఇదే సాక్ష్యం !